నారాయణ శతకము (పాట)

- భావార్ధముతో -

శ్రీరస్తు శుభమస్తు



అవిఘ్నమస్తు

సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A,
గౌతమీనగర్, 3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

శ్రీ నారాయణ శతకము (పాట) - భావార్థముతో -

ప్రార్థన

01. నమామి నారాయణ పాద పంకజం
వదామి నారాయణ నామనిర్మలం
భజామి నారాయణ తత్త్వమవ్యయం
కరోమి నారాయణ పూజనం సదా॥

ఆలోక్య సర్వ శాస్త్రాణి । విచార్య చ పునః పునః ।
ఇదమేకం తు(సు)నిష్పన్నం । ధ్యాయేత్ నారాయణం సదా ॥

సమస్త సంపదలకు నెలవైన శ్రీ లక్ష్మీదేవి హృదయ సామ్రాజ్యమును పాలించువాడా సకల లోకాలకు వెలుగునిచ్చు సూర్య భగవానుడు కలువలను వికసింప జేసినట్లు, నిన్ను నమ్ముకున్న భక్త జనుల హృదయాలను సుజ్ఞానముతో వికసింప చేయువాడవు నీవు. నిలువెల్లా కారుణ్యమును కలిగిన భక్తజన వత్సలుడా, మా వంటి దీనులకు నీవే ఒక మార్గము. మా దీన స్థితిని గమనించి మముమ్మలను కాపాడు నారాయణా!

---

02. పాపకర్మముల జేసి, నరక కూపముల బడజాల నికను।
నీపాద భక్తి యొ(నొ)సగి, యొక్కదరి జూపవే నారాయణా॥

అజ్ఞానముతో తెలియక ఎన్నో పాపములను జేసి ఉంటాను. తెలియక చేసినా, తెలిసి చేసినా అది పాపమే. నా యొక్క పాపములను పెంచేటటువంటి చెడ్డ పనులను చేసి, వాటి కారణంగా నేను భయంకర నరకములలో ఇంక పడజాలను. అతి పవిత్రమైన నీ పాద పద్మముల యందు నాకు భక్తి కలిగించి అనునిత్యం వానిని సేవించు ఒక మార్గమును చూపించమని వేడుకొనుచున్నాను నారాయణా!

03. దానధర్మముల జేయనేర, నీ దాసులను బొగడనేర।
నా నేరముల దలపక, దయచేసి నన్నేలు నారాయణా॥

అర్హత లేనివారికి దానం చేయకూడదు. దానం తీసుకోగలిగిన యోగ్యునికే దానం చేయవలెనని పెద్దలు చెప్పగా విన్నాను. ఎవరు యోగ్యులో ఎవరు అయోగ్యులో తెలుసుకొనలేని అజ్ఞానిని. కాబట్టి దాన ధర్మములు చేసి నీ దయ పొందలేనివాడిని, అలాగే నిన్ను నమ్ముకున్న భక్తుల గొప్పతనాన్ని గుర్తించి వారిని కీర్తింపలేని అజ్ఞానిని. తెలియక ఎన్నో ఎన్నో నేరములు చేసి ఉంటాను వాటిని లెక్కలోకి తీసుకొనకుండా కారుణ్యమూర్తివైన నీవు దయతో నన్ను పాలించు ఓ తండ్రీ నారాయణా!

04. ఆన యించుకలేకను, దుర్భాషలాడు నా జిహ్వాయందు।
నీ నామ చతురక్షరి, దృఢముగా నిలువపలె నారాయణా॥

స్వామీ... ఓ తండ్రీ... అస్థానినైన నా నాలుక మంచి, చెడు తెలియక ప్రతి క్షణము ఎన్నో విధములుగా చెడుగా మాట్లాడుతోంది. దానియందు గల ఆ దుష్ట స్వభావమును పోగొట్టి "నారాయణా!" అను నీ నామములోని నాలుగు అక్షరములను నిరంతరము పలుకునట్లు ధృఢముగా నా నాలుక యందు నిలిపి ఉంచమని నా విన్నపము నారాయణా!

05. ఒకటి పరిశుద్ధిలేక, నా జన్మ మకట! వ్యర్థంబాయెను।
అకలంకమగు మార్గమున్, జూపవే సకలేశ నారాయణా॥

నారాయణా... స్వామీ... నేను చేయరాని ఎన్నో చెడ్డ పనులను చేయుట వలన నా మనసు పరిశుద్ధి కాలేదు. మనసు పరిశుద్ధి కాని నా జన్మ వ్యర్థమైనది. ఓ శ్రీమన్నారయణా! సకల ప్రదేశములందు గలవాడా... నాయందు దయుంచి నా మనసు ఎటువంటి తప్పులూ చేయని మార్గమున నడచునట్లుగా చేసి, నా యందు దయచూపుము తండ్రీ!

06. వేగి లేచినది మొదలు, సంసారసాగరంబున నీదుచు।
మీగుణము నొకవేళను, దలపగదె మేలనుచు నారాయణా॥

నారాయణా... స్వామీ... ఉదయం లేచిన దగ్గరనుండి సంసారమనే సముద్రమందు పడి, కష్టాలు, సుఖాలు, బంధాలు, అనుబంధాల వ్యామోహం లో ఈదులాడుచునే ఉన్నాను. ఎల్లప్పుడూ మంచిని కలిగించు నీ ఉన్నత గుణములను ఏదో ఒకవేళ తలచినా చాలు. అదే మేలు అని భావించిన నా అజ్ఞానమును మన్నింపుము నారాయణా! నిరంతరము నిన్ను, నీ గుణములను కీర్తించు శక్తిని ప్రసాదింపుము తండ్రీ! "ఓం నమో నారాయణాయ!"

07. లోకవార్తలకు మరగి, కర్ణముల మీ కథల విననేరను।
ఏ కరణి భవజలనిధీ, దుదముట్ట నీదుదును నారాయణా॥

ఓ తండ్రీ! నా చుట్టూ ఉన్న వాతావరణం లోని ఎన్నో లౌకిక విషయములు వినుటలో అత్యంత ఆసక్తి కలిగిన నేను చెవులారా ఆపాత మధురములైన తమ లీలా వినోదములను వినలేకపోయాను. సాలిగూడు లో చిక్కుకున్న పురుగు వలె సంసార సముద్రములో చిక్కుకున్న నేను చిట్ట చివరివరకు ఎలా ఈదగలను నారాయణా? నన్ను కరుణింపుము స్వామీ నారాయణా!

08. ఇల మనుజ జన్మమెత్తి, సుజ్ఞానమించుకంతయు లేకను।
కలతజెందెడు చిత్తమున్, స్వచ్ఛంబుగా జేయు నారాయణా॥

స్వామీ... ఈ లోకములో మానవ జన్మ నెత్తి మంచి జ్ఞానమును, నీయందు భక్తియును లేక అనుక్షణమూ కలత చెందున్న నా మనసును ఎటువంటి కలతలూ లేకుండా నిరంతరమూ నీ నామమును స్మరించునటుల స్వచ్ఛంగా నిర్మలంగా చేయి తండ్రీ.. నారాయణా!

09. ఎంత పాపాత్ముడైన, మిముదలచి కృతకృత్యుడౌనుబుడమి।
నింతపరుసము సోకిన, లోహంబు హేమమౌ నారాయణా॥

స్వామీ శ్రీమన్నారాయణా! ఇంత చిన్నదైన పరుసవేది స్పర్శ తగిలినా ఇనుప లోహము బంగారముగా మారినట్లు, ఇనుప లోహం వంటి వాడినైన నేను 'పరుసవేది' వంటి 'నిన్ను' స్మరియించి ఈ లోకమందు గొప్ప పుణ్యమును చేసిన వాడుగా సఫలీకృతుడగునట్లు చేయుము ఓ తండ్రీ!

10. కామాంధకారముననను, బెక్కుదుష్కర్మముల జేసి నేను।
నీ మఱుగు జొచ్చినాను, నామీదనెనరుంచు నారాయణా॥

తండ్రీ నారాయణా! కోరికలు అనెడి అంధకారంలో పడి అనేక చెడ్డపనులు చేయుచు దారికానక కొట్టుమిట్టాడుచున్న నేను చివరకు భయపడి సర్వరక్షకుడవైన నిన్ను ఆశ్రయించినాను. నాపై జాలి చూపి కరుణించుము స్వామీ!!

11. సమయమైనపుడు మిమ్ము, దలచుటకు శక్తిగలుగునో గలుగదో।
సమయమని తలతునిపుడు, నా హృదయకమలమున నారాయణా॥

స్వామీ స్మరణ చేయుటకు తగిన శక్తి ఉండునో లేదో తెలియదు నారాయణా! నిన్ను ఆ హృదయకమలమున తలచుచున్న ఈ స్మరణను ఈ విధముగానే కొనసాగించుచూ నా మరణ కాలమందునూ చేయగల శక్తిని ప్రసాదించుము తండ్రీ!

12. ఆటలన్నియు అంకులు, నేనాడు మాటలన్నియు బొంకులు।
పాటింప నింతకంటె, నున్నదే పాపంబు నారాయణా॥

తండ్రీ నారాయణా! నోటితో పలుకరాని ఎన్నో చెడ్డ పనులను చేసినాను. వాటిని చేయుట కొరకు ఎన్నెన్నో అబద్ధము లాడినాను. ఇంతకంటే మహా పాపము ఏమున్నది స్వామీ! అనుక్షణము నీ నామము స్మరియింప చేసి ఓ కరుణా సముద్రా నన్ను సర్వదా రక్షింపుము శ్రీమన్నారాయణా!

13. వావి దప్పినవాడను, దుష్క్రియా వర్తనుడ నగుదు నేను।
బావనునిగా జేయవే, ననుబతితపావనుట నారాయణా॥

ఓ కరుణా కటాక్షా! బంధుత్వ ధర్మమును పాటించక చేసిన చెడ్డపనులను ఎన్నింటినో మరల మరల చేసిన అల్పుడను నేను. పతితులను, పాపములు చేసిన వారిని పవిత్రులుగా చేయు పతిత పావనుడా! నాకున్న ఈ చంచల బుద్ధిని తొలగించి నా పాపములను పోగొట్టి నన్ను పవిత్రునిగా చేయుము శ్రీమన్నారాయణా!

14. దేహమే దృఢమనుచును, దెలిసి నేమోహబద్ధుడ నగుచును।
సాహసంబున, జేసితి, నే గురుద్రోహంబు నారాయణా॥

ఈ శరీరము చాలా దృఢమైనది. నేను ఎంతో బలవంతుడను. నేను మరి ఎంతో తెలివైనవాడను అన్న మోహమును పెంచు కొనినవాడనై ఇష్టము వచ్చినట్లు ప్రవర్తించి గర్వాంధకారముతో గురుద్రోహమును చేసిన దుర్మార్గుడను. గురు ద్రోహం చేసినవానికి నిష్కృతి లేదు. అట్టి నన్ను నా గర్వమును, అజ్ఞానాం-ధకారమును పోగొట్టి నన్ను దయచూపుము తండ్రీ నారాయణా!

15. ఎన్ని జన్మము లాయెనో, నేటి కెందెందు జన్మించినానో।
నన్ను దరిజేర్పగదవే, యికనైన నాతండ్రి నారాయణా॥

నేను గతములో ఎన్నెన్ని జన్మములు ఎత్తినానో, ఏ ఏ పాపములు చేసి చేసి ఇపుడు ఈ జన్మము ఎందులకు ఎత్తినానో తెలియదు. ఇంకనూ ఎన్ని జన్మములను ఎత్తవలసి ఉన్నదో తెలియదు. కావున ఓ తండ్రీ! నారాయణా.. ఈ జన్మ బంధములనుంచి నన్ను విడిపించి నన్ను నీ దగ్గరకు చేర్చుకోమని ప్రార్థిస్తున్నాను శ్రీమన్నారాయణా!

16. యమకింకరుల దలచిన, నాగుండె యావులింపుచు నున్నది।
యమునిబాధల మాన్పను, మాయప్ప వైద్యుడవు నారాయణా॥

స్వామీ... నే గత జన్మములలో ఎన్నో పాపములను చేసి ఉన్నాను. ఆ పాపములను అనుభవించుటకే ఈ జన్మమును పొంది ఉన్నాను. మరణ సమయమున వచ్చు యమకింకరులు నన్ను తీసుకొని పోయి యమలోకములో నే చేసిన పాపములకు భయంకరమైన శిక్షలు విధిస్తారు - అన్న ఆలోచన వచ్చిన వెంటనే నా గుండె పగిలిపోవుచ్చున్నది. యమునిచే విధించబడు ఆ శిక్షలను పోగొట్టి నన్ను సదా రక్షించు వైద్యుడవు నీవే స్వామిఈ... కావున ఓ నారాయణా! నన్ను కాపాడుము.!!

17. అరయగామక్రోధముల్, లోభంబుమోహమద మత్సరములు।
తఱుగ వెప్పుడు మనసున, నిన్నెపుడు దలచెదను నారాయణా॥

కామము అనగా కోరిక. క్రోధము అనగా కోపము. లోభత్వము అనగా పిసినారితనము. మోహం తాను కోరుకున్నది తనకే కావలనుకునే గుణం. మదము అనగా అహంకారము. మాత్సర్యము అనగా ఈర్ష్య అను గుణములు (అర్షడ్వర్గాలు) నాలోతరగకుండా ఎల్లప్పుడూ పెరుగుతూనే ఉన్నాయి. వాటిని జయించి మనసులో నిన్ను నిరంతరము ఎపుడు తలచెదనో నారాయణా! అట్టి భాగ్యము నాకు కల్పించుము తండ్రీ!

18. ఆశాపిశాచిపట్టి, వైరాగ్య వాసనల జేరనీయదు।
గాసిపెట్టుచు నున్నది, నేనేమి చేయుదును నారాయణా॥

స్వామీ! తండ్రీ! – అశాశ్వతములైన ఈ సంసార బంధములు, సుఖముల యందు నాకు వైరాగ్యం ఉన్నను 'ఆశ' అను పిశాచి నన్ను పీడించుచూ వదలక ఉన్నది. మానసము సంతృప్తి చెందక ఇంకనూ ఏదో కావలయునన్న ఆశను నశింప చేసి సదా నీ ధ్యానం కొరకు, నామ స్మరణము కొరకు నేను ఏమి చేయవలెనో ఆదిశగా నన్ను నడిపించుము నారాయణా!!

19. తాపత్రయంబు జెంది, చాల పరితాపమొందెదు చిత్తము।
నీపాదముల జెందిన, జల్లనై నిలుచుగద నారాయణా॥

స్వామీ! తండ్రీ! మానవ జీవితాన భార్య, పిల్లలు, ధనము అనునవి మూడింటిని కాపాడుకొనుటకు ఎంతయో తాపత్రయము పడవలయును. వీటి బంధనములలో చిక్కుకుని నా మనసు మిక్కిలి బాధపడుచున్నది. నీ పాదములను ఆశ్రయించిన ఎడల ఆ తాపత్రయము వలన కటుగు బాధ పోయే విధంగా చల్లనైన నీ కరుణ నాయందు నిలుచు మార్గము చూపించుము నారాయణా!

20. చింతా పరంపరలచే, జిత్తంబు చీకాకు పడుచున్నది।
సంతోషమునుగూర్పవే, దివ్యప్రసాదమున నారాయణా॥

స్వామీ నారాయణా! సంతృప్తి లేని జీవితములో విపరీతమైన ఆలోచనలతో, సాంసార దుఃఖం వలననూ మనసు అంతా చీకాకుగా ఉన్నది. ఎడతెగని కోరికలతో మనసు బాధపడుతూ ఉక్కిరి బిక్కిరి అవుతున్నది. నీ దివ్యానుగ్రహమును నాపై దయ ఉంచి నా మనసునకు సంతోషమును దివ్య ప్రసాదముగా ప్రసాదింపుమని వేడుకుంటున్నాను తండ్రీ!..

21. ప్రాయమెల్లను బోయెను, నాశలెడబాయ జాలకయున్నవి।
మాయాప్రపంచమేల, చేసెదవు మాయయ్య నారాయణా॥

కాలంతో పాటు వయసంతా గడిచిపోయినది. కాని ఆశలు, కోరికలు మనసును మాత్రము విడిచిపెట్టకుండా ఉన్నాయి. వీటినన్నిటినీ విడిచి నిన్ను సేవించాలని కూడా తెలుసు.

కానీ ఆవిధముగా చేయలేని ఈ మాయా ప్రపంచమును ఎందులకు సృష్టించావు ఓ తండ్రీ నారాయణా! దీనినుంచి విముక్తి కలిగించి నీ దరికి చేరు దారిని బోధించుము తండ్రీ..

22. శరణు జొచ్చినవాడను, నేజేయు దురితముల నపహరించి।
పరమపదమొసగగదవే, యికనైన బరమాత్మ నారాయణా॥

స్వామీ నారాయణా! అన్నివిధములుగా నిన్ను శరణు వేడుకొనుచునే యున్నాను. నేను చేసిన పాపాలను అన్నింటినీ అగ్నిచితుకులను దహించి వేసినట్లు హరించివేసి, నన్ను పవిత్రునిగా చేసి నాకు ఇకనైనా నీ పరమ పదమును ప్రసాదించుము. నాకు మోక్షమిచ్చి నీ దయకు పాత్రుని చేయుము ఓ తండ్రీ!

23. సంకల్పముల బుట్టిన, కర్మవాసనలు దృఢముగ జేయవు।
సంకటము నొందించకే, నను సత్యసంకల్ప నారాయణా॥

సత్య సంకల్పుడవైన ఓ తండ్రీ! మంచిపనులు చేసి, నిన్ను సేవిస్తూ నీయందు భక్తిగా ఉండవలయును అను సంకల్పము నాకు ధృఢముగా ఉన్నది. కానీ నేను పూర్వ జన్మములలో చేసిన కర్మల యొక్క ప్రభావములు నాలోని సంకల్పాన్ని బలహీన పరచుచున్నవి. కాబట్టి నన్ను ఆపదల పాలుచేయక సదా రక్షింపుము నారాయణా!

24. ఒక వేళ నున్న బుద్ధి, యొకవేళ నుండదిక నేమి సేతు।
సకలంకముగ జేయవే, నీవు నా చిత్తమును నారాయణా॥

స్వామీ.. నారాయణా! నా మనసు చంచలమైనది. ఎల్లప్పుడు పరి పరి విధములుగా ఆలోచించుచుండును.ఒకప్పుడున్నట్లుగా మరి ఒకప్పుడు ఉండదు. పెడదారులు పట్టు చుండును. అందుచేత ఎటువంటి కళంకము లేకుండా - అనగా ఏ అపనింద పడని విధముగా ప్రవర్తించేలా నా మనసును సరి అయిన మార్గములో నడుపుము తండ్రీ..

25. నెట్టుకొని సకలజీవకోటులను, గొట్టి భక్షించినాను।
పొట్టకొఱకై నీచుల సేవించి, రట్టయితి నారాయణా॥

ఆర్తత్రాణ పరాయణా! నారాయణా .. ఈ ప్రపంచంలో నాకు అందుబాటులో ఉన్న అనేక ప్రాణులను దౌర్జన్యంగా హింసించి, చంపి, బక్షించితిని. పొట్ట నింపుకొనుటకై నీచులను సేవించి అగౌరవమును పొందాను. అటువంటి నన్ను సదా నీ ధ్యానము చేయునట్లు దీవించి సర్వవేళలా రక్షింపుము తండ్రీ!

26. నేను బుట్టినది మొదలు, ఆహార నిద్రలను జనెగాలము।

పూని యెప్పుడు సేయుదు, నీ పద ధ్యానంబు నారాయణా॥

స్వామీ.. నేను పుట్టినప్పటినుంచి కాలమంతా సంపాదించుట, తినుట, నిద్రించుట మొదలగు వాటితోనే గడుచు చున్నది ఉద్దేశపూర్వకముగా నిన్ను ఎప్పుడు పూజింపవలెనో, ధ్యానించవలెనో అర్థం కావటం లేదు. కావున నా జీవన గతిని నీవైపు మరలింపుము తండ్రీ నారాయణా!

27. ప్రొద్దు వోపకయున్నను, వేసరక పొరుగిండ్ల దిరుగుగానీ।
బుద్ధి మాలిన చిత్తము, నీయందు బొందదదే నారాయణా॥

స్వామీ! నారాయణా! ఉదయము లేచిన దగ్గరనుంచి నాకు కాలక్షేపము లేక ఇరుగు పొరుగు వారల ఇళ్ళకు తిరగడంతోనే సమయము వృధా అయిపోవు చున్నది. నా పనికిమాలిన మనసు నీయందే లగ్నమే చేయదు.నా మనసు నిరంతరము నీ యందే కేంద్రకరింపచేసి నన్ను రక్షింపుము తండ్రీ!

28. ఎన్నివిధముల జూచిన, నిత్యమును హృదయమున మిము మఱువక।
యున్నంతకన్న సుఖము, వేఱొక్కటున్నదే నారాయణా॥

నా మనసు ప్రతీక్షణమూ ఏదో ఒక దాని గురించి ఆలోచిస్తూనే ఉంటుంది. అటా కాకుండా ప్రతీరోజు మిమ్మల్ని మరచిపోకుండా మీపై ధ్యానమును నా మనసునందే నిలుపుకొన్నచో అంతకు మించిన ఆత్మానందము వేరొకటి లేదు నారాయణా .. కాబట్టి నా మనసు నీ యందే లగ్నము చేయునట్లు నన్ను కాపాడుము తండ్రీ!

29. లాభ లోభముల విడచి, యిహపరంబులను ఫలమాసింపక।
నీభక్తులైనవారు, ధన్యులై నెగెడెదరు నారాయణా॥

స్వామీ! ఒకదానిని పొందితే కలిగే లాభమును, మరొకదానిని చేజార్చు కున్నప్పుడు కలిగే విచారములను విడిచి ఈ లోకం లోనూ, పరలోకం లోనూ ఫలితాన్ని ఆశించకుండా నీ యందు భక్తి కలిగినవారు ధన్యులు. వారే ఈ లోకములో చిరకాలమూ నిలిచి ఉంటారు. నాకునూ వారి సరసన చేరు భాగ్యం కల్పించుము తండ్రీ నారాయణా..

30. ముందు నీ సృష్టి లేక, సచ్చిదానంద స్వరూపంబును।
బొంది భేదము నొందక, బ్రహ్మమై యుందువట నారాయణా॥

స్వామీ! నారాయణా! ఈ చరాచర సృష్టి లేనప్పుడు నీవు సచ్చిదానంద స్వరూపుడవై ఇహ, పర బేధము లేక బ్రహ్మ స్వరూపముతో ఉండేటివాడవట కదా తండ్రీ .. అటువంటి

సత్ + చిత్ + ఆనందమైన రూపముతో ఈ లోకమును రజింపజేయు కమలనయనా! వాటిని నాకు బోధపరచి నన్ను సదా కాపాడుము తండ్రీ!

31. కాలత్రయాబాధ్యమై, మఱి నిరాకారమై యుండు కతన।
జాలగా దత్త్వజ్ఞులు, తెలియుదురు సత్తనుచు నారాయణా॥

స్వామీ నారాయణా! భూత, వర్తమాన, భవిష్యత్తు కాల బేధములు లేకుండా .. ఆకారము లేని నిరాకార రూపమైన వాడవని నీ సత్ స్వరూపమును గూర్చి తత్వజ్ఞులు లోకానికి తెలియ చేయుచున్నారు స్వామీ .. ఆ సత్ స్వరూపమును తెలుసుకొను సుజ్ఞానమును నేను అనుసరించు మార్గమును తెలియజేయు తండ్రీ!

32. జ్ఞానస్వరూపమునను, నజడమై జడపదార్థముల నెల్ల।
గానగా జేయుకతన, జిత్తండ్రు ఘనును నిను నారాయణా॥

శ్రీమన్నారయణా! చిత్ అనునది జ్ఞానస్వరూపము. అది జడత్వము లేనిది. అట్టి జ్ఞానస్వరూపము జడము లైన వాటిని అన్నింటిని కూడా మనకు స్పష్టమగు నట్లు చేయునని విజ్ఞత కలిగిన పెద్దలందరూ చెప్పుచున్నారు. ఆ చిత్ స్వరూపము నీవే అని నేను గ్రహించునట్లు చేయుము తండ్రీ!

33. సుఖ దుఃఖముల రెంటికి, వేఱగుచు సుఖరూపమైన కతన।
అఖిల వేదాంతవిదులు, ఆనందమండ్రు నిను నారాయణా॥

స్వామీ! నారాయణా ... ఈ లోకమున సుఖము, దుఃఖముల కంటే వేరుగా మరియు ఆ రెంటి కంటే ఉన్నతముగా ఉండెడిది “ఆనందము”. ఈ ఆనందమే సుఖమును అందించు మూల సాధనము. ఆ ఆనంద స్వరూపము నీదే అని ఈ ప్రపంచములోని వేదాంతము తెలిసిన విజ్ఞులందరూ చెప్పుచున్నారు తండ్రీ! – అట్టి ఆనందమును పొందు భాగ్యము నాకు ప్రసాదించుము తండ్రీ!

34. గుణమొకటియైన లేని, నీయందు గుణమయంబైన మాయ।
గణుతింప గనుపట్టెడు, దర్పణము కైవడిని నారాయణా॥

స్వామీ ... శ్రీమన్నారయణా! యే ఒక్క గుణమూ లేని “నిర్గుణు”డవు నీవు. కానీ నీ యందు గుండములతో నిండిన “మాయ” ఉండును. అద్దములో స్వచ్ఛమైన ప్రతిబింబము కనిపించినట్లుగానే నీయందు గుణములు కల మాయ కనిపించునని పెద్దలు చెప్పుచున్న మాటలు నేను అర్థము చేసుకొనగలుగు విజ్ఞానము ప్రసాదించుము తండ్రీ!

35. అందు బ్రతిబింబించిన, చిత్సదానంద సముదాయమెల్ల।
జెందు నీశ్వరభావము, త్రిగుణసంశ్లిష్టమై నారాయణా॥

ఓ శ్రీమన్నారయణా! సత్వము, రజస్సు, తమస్సు అను మూడు గుణములతో కలసి ఏర్పడు ఈశ్వర తత్వమును నిర్గుణ స్వచ్ఛమైన సచ్చిదానంద రూపమున నీయందు ప్రతిబింబించును. సంక్లిష్టమైన అట్టి మూడు గుణములను అర్థం చేసుకుని నిన్ను దర్శించు భాగ్యము కలుగజేయుము తండ్రీ! నారాయణా!

36. సత్వంబు రజము తమము, నను మూడు సంజ్ఞలను క్రమముతోడ।
దత్వజ్ఞులేర్పరింప, దద్గుణత్రయములగు నారాయణా॥

సత్వము, రజస్సు, తమస్సు అను ఈ మూడు గుణములు సంజ్ఞలుగా ఒక క్రమములో తత్వజ్ఞులు తెలుసుకుని వానిని సద్గుణ త్రయము అని లోకానికి విశదపరచు చున్నారు. తండ్రీ! శ్రీమన్నారయణా!

37. ప్రకృతి నీయందు, లీన మయియుండి వికృతిజెందిన వేళను।
సకలప్రపంచమిటుల, గనుపట్టె నకలంక నారాయణా॥

స్వామీ! నారాయణా! ప్రకృతి యందు లీనమై ఉండి నిర్గుణుడవైన నీ యందు గుణములు గల మాయగా వికృతి చెంది మార్పు చెందినప్పుడే ఈ ప్రపంచమంతా మాయగా కనబడుతుంది. కానీ నీవు మాత్రము ఎట్టి మార్పుయును లేక ఉండు మహిమాన్వితుడవు తండ్రీ నారాయణా!..

38. మీరు సంకల్పించిన, యిష్టప్రకారమున జెందు మాయ।
ఆరూఢి వివరించెద, నవ్విధం బొప్పంగ నారాయణా॥

ఓ తండ్రీ! నీవు ఏవిధముగా సంకల్పిస్తావో, ఖచ్చితముగా ఆ విధముగానే మాయ మార్పు చెంది జనులను భ్రమింపచేయును. నాకు తెలిసినంతవరకు ఆ విధానమును నేను వివరించెదను ఓ తండ్రీ .. నారాయణా!

39. పంచభూతములు మనసు, బుద్ధియును బ్రకటహంకారంబును।
నెంచంగ నాయె మాయ, యిదిగా ప్రపంచంబు నారాయణా॥

ఓ తండ్రీ.. పంచభూతములు అనగా భూమి, నీరు, గాలి, ఆకాశము, అగ్ని – మరియు – మనస్సు, బుద్ధి, అహంకారము, ఇవి అన్నియు మాయ వలన సృష్టింపబడినవి. ఇందువలననే మనము చూచుచున్న ప్రపంచం ఏర్పడినది. అవును కదా.. నారాయణా!

40. భూతపంచకసత్వ, సంఘాతమున బుట్టె నంతఃకరణము।
ఖ్యాతిగా నందు దోచు, చిత్తె జీవాత్మయె నారాయణా॥

స్వామీ! నారాయణా! పంచభూతములన్నియు వాటి తత్వములను అవి కలిగి ఉన్నవి. వానియందు పుట్టినదే అంతఃకరణము. పరమాత్మలోని చిత్: అను శబ్దమే మనకు జీవాత్మగా గోచరించు చున్నది. అని భావించు చున్నాను తండ్రీ!

41. వెసమనో బుద్ధి చిత్తా, హంకార వృత్తు లంతఃకరణము।
ప్రసరించినవి నాలుగు, తత్త్వరూపములాయె నారాయణా॥

ఓ నారాయణా! తండ్రీ - మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అను నాలుగును అంతఃకరణమునకు చెంది నాలుగువిధములైన తత్వ రూపములుగా ఉన్నవని విజ్ఞులు చెప్పుచున్నారు. వానిని తెలుసుకుని నీ దరి చేరు భాగ్యము కలుగజేయుము తండ్రీ..

42. భౌతిక రజోగుణములు, నేకమై ప్రాణంబు బుట్టించెను।
వృత్తిభేదములచేత, బంచ భావములాయె నారాయణా॥

ఓ నారాయణా! తండ్రీ! పంచభూతములకు చెందిన రజోగుణముల సంయోగము చేత 'ప్రాణము' పుట్టినదట. వాత బేధముచే ఆ పంచ భూతములు ప్రాణవాయువై అయిదు విధములయ్యేనని వేదాంతవిదులు తెలుపుచున్నారు స్వామీ! వానిని అవగతము చేసుకుని నిన్ను సదా జపించు వరమీయుము తండ్రీ!

43. అలరు ప్రాణ మపానము, వ్యానంబు దా సమానోదానముల్।
తలప నీ సంజ్ఞలమరి, వాయుతత్త్వము లొప్పు నారాయణా॥

ఓ నారాయణా తండ్రీ! ప్రతి మానవుని దేహంలో ఐదు రకముల వాయువులుంటాయి - 01. ప్రాణం, 02. అపానం, 03. వ్యానం, 04. ఉదానం, 05. సమానం - వీటిని పంచప్రాణాలని పిలుస్తారు. ప్రాణవాయువు హృదయంలో, అపానవాయువు మూలాధారంలో, వ్యానవాయువు దేహమంతా, ఉదానవాయువు కంఠంలో, సమాన వాయువు నాభిలో నెలకొని ఉంటుందని అర్థమయింది స్వామీ!

44. ప్రత్యేక భూత సత్వ, గుణములను బరగ బుద్ధీంద్రియములు।
సత్వమున జనియించెను, తత్త్వపంచకమగుచు నారాయణా॥

నారాయణా! పంచ భూతములతో సత్వగుణం కలియుటచేత బుద్ధియును, ఇంద్రియములు అయిదును తత్వ పంచకం గా ఏర్పడినవి అని గ్రహించితిని స్వామీ! - వాటి అంతర్గత తత్వమును తెలుసుకుని నిన్ను దరిజేరు భాగ్యము తెలియ జేయుము తండ్రీ! నారాయణా..

45. చెవులు చర్మము కన్నులు, జిహ్వ నాసికము పేరులచేతను।
తవిలి బుద్ధీంద్రియములు, విషయ సంతతి దెలియు నారాయణా॥

నారాయణా! - చెవులు, చర్మము, కన్నులు, నాలుక, ముక్కు అను అయిదు పంచేంద్రియములు ఆ యా ఇంద్రియ సుఖములను గమనింపగలిగి ఉండుననియు, వీనిని జ్ఞానేంద్రియములు అనియు తెలుసుకున్నాను తండ్రీ.. నా జ్ఞానేంద్రియములతో అను నిత్యం నీ స్మరణ జేయు భాగ్యం ప్రసాదించు తండ్రీ!

46. భౌతిక తమోగుణమున, విషయములు తఱచుగా జనియించెను।
శబ్ద సంస్పర్శ రూప, రస గంధ నామములు నారాయణా॥

స్వామీ నారాయణా! పంచ భూతములతో 'తమో' గుణము కలియుట వలన శబ్దము, స్పర్శ, రూపము, రుచి, వాసన అను అయిదును ఆయా ఇంద్రియముల సుఖ దుఃఖాలుగా ఏర్పడినవని అవగతమైనది స్వామీ. పంచేంద్రియములు నీయందు నిలిపి అనుక్షణం నిన్ను స్మరించు భాగ్యము కల్పించుము తండ్రీ!

47. తాదృశ రజోగుణమున, జనియించె నరక కర్మేంద్రియములు।
ఐదు తత్త్వములగుచును, గర్మనిష్ఠాదులకు నారాయణా॥

స్వామీ తండ్రీ! పంచ భూతములకు రజోగుణము కూడ తోడగుటచే కర్మేంద్రియములైదును అయిదు తత్వములుగా ఏర్పడినవని అర్థమైనది. తండ్రీ .. ఆ పంచ తత్వ సారమును అర్థం చేసుకుని నీ దరి చేరు తరుణోపాయము అనుగ్రహింపుము నారాయణా..

48. వాక్పాణి పాదపాయూపస్థలను, వాని వేళ్ళమరుచుండు।
బక్వహృదయులకు దెలియు, నీ విధము పరమాత్మ నారాయణా॥

నారాయణా! నోరు, చేయి పాదములు, పాయువు, ఉపస్థ అను ఆయిదును ఆ కర్మేంద్రియ తత్వముల పేర్లు అని తెలుసుకున్నాను. ఈ విషయము హృదయ పరిపక్వత కలిగిన వారికి మాత్రమే తెలియునని అవగాహన కలిగినది తండ్రీ - అటువంటి అవగాహన నాకు కలిగించి నన్ను చరితార్థుని చేయుము తండ్రీ..

49. పలుకు పనులును నడకయు, మల మూత్రముల విడుచుటీ యైదును।
వెలయ గర్మేంద్రియముల, విషయములు నలినాక్ష నారాయణా॥

నోటితో మాటలాడుట, చేతులతో పనిచేయుట, పాదములతో నడచుట, మల మూత్రములు విసర్జించుట అను ఈ అయిదు ఆయా కర్మేంద్రియముల విషయములని

పెద్దలు చెప్పుచున్నారు. పద్మముల వంటి కన్నులు గల నా స్వామీ! నన్ను సదా నీ అభయ హస్తముతో కాపాడుము తండ్రీ..

50. పరగజంద్రుండు బ్రహ్మ, క్షేత్రజ్ఞుడిరవొంద రుద్రుడచట।
పరమానసాదులకును, నధిపతులు వివరింప నారాయణా॥

తండ్రీ నారాయణా! – చంద్రుడు, బ్రహ్మ, క్షేత్రజ్ఞుడు, రుద్రుడు, పరమాత్మ, వీరందరూ సాధనచేయువారలైన సాధువులకు అధిపతులు అని పరిశీలింపగా తెలిసిన విషయమని విజ్ఞులు తెలిసిన విషయమని విజ్ఞులు తెలుపుతున్నారు స్వామీ – వాటిని పరిపూర్ణముగా తెలుసుకొను భాగ్యము ప్రసాదింపుము తండ్రీ..

51. అరయ దిక్కులు వాయువు, సూర్యుడును, వరుణుండు నశ్వినులును।
పరగ శ్రోత్రాదులకును, నధిపతులు పరికింప నారాయణా॥

ఓ నారాయణా! చెవి మున్నగు అవయవములకు దిక్కులు, వాయువు, సూర్యుడు, వరుణుడు, అశ్వనీ దేవతలు – అందరునూ అధిపతులుగా విజ్ఞులు చెప్పుచున్నారు. ఆ తత్వమును నాకు ఎఱింగించి నన్ను కృతార్థుని చేయుము స్వామీ నారాయణా..

52. అనలుడింద్రుడు విష్ణువు, మృత్యువును నల ప్రజాపతియు గూడి।
యొనర వాగాదులకును, నధిపతులు పరికింప నారాయణా॥

స్వామీ! ఓ శ్రీమన్నారయణా – అగ్ని, ఇంద్రుడు, విష్ణువు, మృత్యువు, (ప్రజాపతి) బ్రహ్మ వీరందరూ శరీరములోని నాడులకు అధిపతులుగా ఆ సాధకులు తెలియ జేయుచున్నారు. ఈ విషయములన్నీ అవగతము చేసుకును జ్ఞానము ప్రసాదించుము తండ్రీ..

53. పంచీకృతంబాయెను, భూతపంచకము ప్రబలించి సృష్టి।
బంచీకృతముచేతను, స్థూలరూపములాయె నారాయణా॥

నారాయణా! పంచ భూతములు కలసి పంచీకృతంబై సృష్టి ప్రభవించినది. అందు పంచీకృతము చేత పంచభూతములు స్థూలమైన రూపముగా ఏర్పడినది అని జ్ఞానులు తెలియచేయుచున్నారు స్వామీ..

54. పదియింద్రియములు మనసు, బుద్ధియును బ్రాణంబులైదుగూడి।
పదియేడు తత్త్వములును, సూక్ష్మదేహంబాయె నారాయణా॥

తండ్రీ! నీ లీలలు తెలిసికొన నెవరితరము? పది ఇంద్రియములు, మనసు, బుద్ధి, అయిదు ప్రాణములు, పదిహేడు తత్వములును అన్నియు కలగలిసి ఈ సూక్ష్మమైన దేహంగా

ఏర్పడినదని తెలుసుకొనినాను. అటువంటి ఈ దేహము నందు అను నిత్యము నీవు కొలువై ఉండు నటుల దీవించుము తండ్రీ!

55. స్థూల సూక్ష్మములు రెండు, గలుగుటకు మూలమగు నజ్ఞానము।
లీల కారణమాయెను, జీవులకు నా లోన నారాయణా॥

స్వామీ! జీవులందరికీ స్థూల సూక్ష్మములు అను రెండును ఏర్పడుటకు గల అజ్ఞానము ఎందులకు కారణమైనది స్వామీ.. అదే అజ్ఞానము నేను కలిగి ఉన్నాను పరాత్పరా! .. కావున నా అజ్ఞానమును తొలగించి నిన్ను అణువంత మాత్రమైనను తెలుసుకొను సుజ్ఞానమును ప్రసాదించుము స్వామీ..

56. ఈ రెండు దేహములకు, విశ్వంబదెల్ల బ్రకటంబాయెను।
నామరూపములచేత, లోకైక నాయకుడ నారాయణా॥

తండ్రీ .. స్థూలము, సూక్ష్మము, కారణము అను ఈ మూడింటిని ఈ ప్రపంచము నామ రూపములచే వ్యక్తము అగుటకు ఆధారభూతమైనది. వానిని గూర్చి పరిపూర్ణముగా తెలుసుకొను భాగ్యము కలిగించుము స్వామీ.. లోకనాయకుడవైన లక్ష్మీనారాయణా..

57. కొన్ని మావిని బుట్టును, గ్రుడ్లలో గొన్ని తనువులు పుట్టును।
కొన్ని ధరణికి బుట్టును, జెమటలకు గొన్ని హరి నారాయణా॥

స్వామీ! కొన్ని ప్రాణులు గర్భవతి అయిన స్త్రీ గర్భములో గల ద్రవ రూపములో గల మావియందు పుట్టుదురు. మరికొన్ని గుడ్లనుండి, మరికొన్ని శరీరములనుండి, మరికొన్ని భూమి నుండి, మరికొన్ని చెమట వంటి తడియందును జన్మించునని తెలుసుకున్నాను తండ్రీ .. నిన్ను పరిపూర్ణముగా తెలుసుకొను సదావకాశము నాకు కల్పింపుము లక్ష్మీ వల్లభా!

58. ఈ చతుర్విధ భూతములందు, గడు హెచ్చు మానవజన్మము।
నీచమని చూడరాదు, తథ్యమే నిర్ణయము నారాయణా॥

స్వామీ నారాయణా! అన్ని జన్మములలోనూ ఉత్తమమైన మానవ జన్మ ఎంతో గొప్పది. మిగతా జన్మలలో జీవులకు లేని జ్ఞానము మానవులకు ఉండుటయే అత్యంత గొప్ప విషయము. విచక్షణా జ్ఞానము కలిగినట్టి ఇట్టి మానవ జన్మను తక్కువ అని భావించి నిందించుట తగదు అని తెలుసుకున్నాను తండ్రీ!!

59. ఈ జన్మమందె కాని, ముక్తి మఱి యే జన్మమందు లేదు।
చేజేత దను దెలియక, మానవుడు చెడిపోవు నారాయణా॥

స్వామీ ఓ లక్ష్మీనారాయణా! ముక్తిని సాధించుటకు వీలైన జన్మ కేవలము మానవ జన్మయే. మిగిలిన జన్మములందు మోక్షము పొందుట సాధ్యము కాదు. కానీ మానవులు ఈ విషయమును గ్రహింపక స్వయంకృతములైన కర్మలను ఆచరించి చెడిపోవుచున్నారు. కావున సత్కర్మలను ఆచరించు రీతిగా మమ్ములను నడిపించుము తండ్రీ నారాయణా!

60 చేతనా చేతనముల, బుట్టుచును రోతలకు లోనగుచును।
నాటంకపడుచుండును, గర్మములజేతనుడు నారాయణా॥

నారాయణా! జీవులు చేతనములుగాను, అచేతనములుగాను పుట్టును. రోతలకు లోనవుతూనే తానూ తెలిసి తెలియక చేయు కర్మలకు లోబడి ఆ కర్మలను చేయుటలో అనేక ఆటంకములను ఎదుర్కొనుచు, ఇబ్బందులలో చిక్కుకొనునని అవగతమైనది నారాయణా! అట్టి స్థితిలోకి నేను వెళ్లకుండగా, నన్ను అనుక్షణము రక్షింపుము.

61. సకలయోనుల బుట్టుచు, బలుమాఱు స్వర్గనరకముల బడుచును।
నొకట నూఱటగానక, పరితాపమొందితిని నారాయణా॥

స్వామీ! నేను అనేక విధములైన "యోను" లందు పుట్టుచు, మంచి పనులు చేసినపుడు స్వర్గమును, చెడుపనులు చేసినపుడు నరకమును అనుభవించుచు కర్మాంతమున మరల జన్మించుచు ఆయా కర్మలవలన వచ్చు అనేక విధములైన ఫలితములను అనుభవించుచునే ఉన్నాను. కానీ ఏవిధముగాను నేను ఊరట పొందలేకపోవుచున్నాను. పైపెచ్చు ఇంకనూ పరితాపమును పొందుచునే ఉన్నాను. కావున నా పాపములవలన కలుగుచున్న నా పరితాపమును పోగొట్టి నన్ను నీ దరిచేర్చుకొనుము నారాయణా!

62. వెలయ నెనుబదినాలుగు, లక్షలయోనులయందు బుట్టిగిట్టి।
యలసిమూర్ఛల జెందుచు, బహుదుఃఖములచేత నారాయణా॥

తండ్రీ! జీవుడు వివిధములైన ఎనభై నాలుగు లక్షల యోనుల పుట్టుచు, మరణించుచూ, అలసి, సొలసి కర్మ పరిపక్వము నొందక మూర్ఛుల్లుచునుండును. అట్టి దురవస్థ నాకు కలుగనీయక నా కర్మలను పరిపక్వము చేసి నన్ను నీదరి చేర్చుకొనుము నారాయణా!

63. క్రమముతో మనుజగర్భమున బడియు, గర్మవశగతుడగుచును।
నమితముగ నచ్చోటను గర్భనరకమునబడి నారాయణా।

స్వామీ! జీవుడు అలా అనేక జన్మముల నెత్తి చివరగా పుణ్యవశమున మనుష్యుల గర్భమున జన్మించి తాను చేసిన సుకృత మరియు దుష్కృత కర్మలకు లోబడి తల్లి గర్భమున

తొమ్మిదినెలలు నరకబాధను అనుభవించి జన్మించును అన్న సత్యమును తెలుసుకున్నాడను తండ్రీ!! కావున నాయందు దయవుంచి నాపై నీకరుణను అనుక్షణము ప్రసరింపచేయుము తండ్రీ..

64. ఈశ్వరాజ్ఞను బుట్టిన, తెలివిచే హృదయమున దలపోయుచు।
విశ్వమున దనుబొందిన, పాట్లెల్ల వేర్వేఱ నారాయణా॥

స్వామీ! ఆ పరమేశ్వరుని ఆజ్ఞను అనుసరించి జన్మించిన జీవుడు ఆయన ఒసగిన జ్ఞానబలముచే తాను గత జన్మములలో ఏ ఏ పాపములు చేసి, ఏ ఏ కష్టములు పడితినో కదా అని తలపోయుచునే బ్రతుకు కొనసాగించుచుండును. కావున ఓ కమల లోచనా! అనుక్షణము నీ నామమును జపియించుచూ జీవించు వరమును ప్రసాదింపుము తండ్రీ!!

65. చాలు ఛీ!యిక జన్మము, మరణంబునెల్ల శ్రీహరి భజించి।
మేలు చెందెద ననుచును, జింతించు నాలోన నారాయణా॥

నారాయణా! నీ అనుగ్రహము వలన పుట్టిన ఈ పుట్టుక ఈ జన్మకు చాలును. ఇకపై జన్మించుండా అనుగ్రహింపుము. అనుక్షణము శ్రీహరివైన నీ నామ జపమును చేయుచు మేలు పొడగలనను ఆశ నాలో అంకురించుచున్నది. అనుక్షణము నిన్ను ధ్యానం చేయుచూ ఈ జన్మాంతమున నీలో ఐక్యమగు వరము ప్రసాదించుము తండ్రీ!!

66. ప్రసవకాలమున దల్లి, గర్భమున బాదుకొని నిలువలేక।
వసుధపయి నూడిపడిన, తెలివిచే వాపోవు నారాయణా॥

స్వామీ! జీవుడు తన తల్లి ప్రసవించుకాలమున తల్లి గర్భమున ఇమడలేక, ఉండలేక, నిలువజాలక, ఈ భూమిపై బడి తెలివి తెచ్చుకొని మరలా యే కష్టములను అనుభవించుటకు పుట్టితినో కదా అని అనుక్షణము విచారించును. అటువంటి బాధలు నాకు కలుగకుండా నన్ను నీలో ఐక్యము చేసుకొను వరము ప్రసాదించుము తండ్రీ!

67. చనుబాలు గుడిచి, ప్రాణ ధారణను మూత్ర మలములోను।
మునిగి తేలుచు నుండును, దుర్గంధమున శిశువు నారాయణా॥

స్వామీ! జీవుడు జన్మించిన తరువాత బ్రతకడం కోసం తల్లి వద్ద చనుబాలు తాగి, తాను విడిచిన మల మూత్రముల యందు దుర్గంధములో జీవించు చుండును. తన పనులు తాను చేసుకోలేనివాడు అగుటచే అట్టి దురవస్థలో ఉండునని గ్రహించితిని నారాయణా! తండ్రీ! అప్పటినుంచియే నీ నామమును స్మరియించు భాగ్యము జీవునకు ప్రసాదింపుము తండ్రీ!

Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

68. బాలత్వమున బిత్తరై, నలుగడల బాఱాడు సిగ్గులేక।
పాలుపడి యౌవనమున, విషయానుభవమొందు నారాయణా॥

నారాయణా! జీవుడు బాల్యములో తెలియని తనము వలన సిగ్గువిడిచి దిగంబరియై అన్ని దిక్కుల పాకుచూ అటూ ఇటూ తిరుగును. యవ్వన ప్రాయములో ఇంద్రియ సుఖములను అనుభవించవలయునని, విషయములన్నీ తెలుసుకొనవలయునని అనుక్షణము తాపత్రయ పడుచుండును. రక్తి అనంతరము అనుక్షణము నిన్ను జపించు భాగ్యము కలుగజేయుము తండ్రీ!

69. ముదిమి వచ్చిన వెకను, సంసారమోహంబు మానలేక।
తుది నేగు గర్మ గతుల, బొందుటకు ముదమేమి నారాయణా॥

ఓ తండ్రీ! యవ్వన మోమానికి చిక్కిన జీవుడు అనేక సంసార బంధములకు చిక్కుబడి చివరకు తాను చేసిన తన కర్మల ఫలితములనుఅనుభవించుచూ ముసలితనమునకు జేరును. మనిషిగా పూర్తి ఇన్ని జీవన దశలను చూచి అతడు ఎటువంటి సంతోషమును పొందినాడో కదా తండ్రీ...

70. అజ్ఞాన లక్షణంబు, లిటువంటివని విచారించి నరుడు।
సుజ్ఞానమునకు దగిన, మార్గంబు చూడవలె నారాయణా॥

స్వామీ! నారాయణా! జీవుడు అజ్ఞాన లక్షణులు ఇటువంటివి. వాటికి లోబడిన వాడి గతి హీనంగా ఉండును అని గ్రహించినవాడై, ఫలితముగా నీవనుగ్రహించిన జ్ఞానము వలన అనుక్షణము నిన్ను స్మరించుట ద్వారా ముక్తిని పొందుటకు తగిన మార్గమును చూడవలయును అని గ్రహించును. కనుక అట్టి జ్ఞానమును నాకు ప్రసాదింప చేయుము తండ్రీ!

71. వేదాంత వేదియైన, సద్గురుని పాదపద్మముల జెంది।
ఆ దయానిధి కరుణచే, సద్బోధమందవలె నారాయణా॥

జీవుడు తాను యే స్థితిలోఉన్నాడో తెలుసుకొని, ఆ పరిస్థితిని గమనించి, వేదాంత విషములను బాగుగా తెలిసిన మంచి గురువును నలుగురి ద్వారా తెలుసుకుని, వారి పాదపద్మములను నమ్మి, వారి బోధనలను ఆకళింపు చేసుకుని, వారి దయను పరిపూర్ణముగా పొందవలెను. ఆ దయామూర్తి కరుణను పొంది, వారి బోధనలను ఆకళింపు చేసుకుని తరించుటకు ప్రయత్నించవలెనని నాకు అవగతమైనది నారాయణా!

72. ఏ విద్యకైన గురువు, లేకున్న నా విద్య పట్టుపడదు।
కావునను అభ్యాసికి, గురు శిక్ష కావలెను నారాయణా॥

గురువు ముఖతహా నేర్వణి విద్య వంటబట్టదు. రాణింపదు. కావున అభ్యాసము చేయదలచినవాడు గురువు వద్ద చేరి విద్య నేర్చుకొనవలయును. కావున సరియైన అభ్యాసికి సరియైన గురువు లభించి విద్య నేర్పిన యెడల అట్టి విద్య వలన అతడు లాభపడునని గ్రహించితిని కమల లోచనా!

73. గురు ముఖంబున విద్యల, నెన్ని గైకొనక భావ జ్ఞానము।
జిరతరాధ్యాత్మ విద్య, నభ్యసింపగ లేదు నారాయణా॥

గురువు వద్ద శిష్యుడు ఎన్ని విద్యలను నేర్చినను భావార్థమును గ్రహించిన యెడల ఆ విద్య సార్ధకమగును. ఆధ్యాత్మిక విద్య నిరంతర సాధనవలన అలవడును. కావున ఆధ్యాత్మిక విద్యను భావార్థముతో గ్రహించి నిరంతర సాధన చేయవలెనని అవగతమైనది నారాయణా!

74. నిరపేక్షకుడుసదయుడు, వేదాంతనిపుణుడౌయాచార్యుడు।
దొరకుటకు రూపమపుడు, గుఱుతైనగుఱియొప్పు నారాయణా॥

గురువు శిష్యుని నుండి ఏమియు ఆశించని, కోరనివానిగా ఉండవలయును. దయావంతుడై వేదాంత విద్యయందు నిష్ణాతుడై ఉండవలెను. అట్టి గురువు దొరకుట చాలా కష్టం. అట్టి లక్షణములున్న గురువును అన్వేషించి గుర్తించి సేవించి, వారిని గురువుగా పొంది సాధన ఆరంభించవలయును అని అవగాహన చేసుకున్నాను నారాయణా!

75. అట్టి సద్గురుని వెదకి, దర్శించి యా మహాత్ముని పదముల।
బట్టి కృతకృత్యుడౌను, సాధకుడు గట్టిగా నారాయణా॥

సాధకుడు సర్వ విషయపరిజ్ఞానము, వేద వేదాంగ జ్ఞానము గల సద్గురుని దర్శించి ఆ మహాత్ముని పాదములను ఆశ్రయించినపుడు మాత్రమే కృతకృతజ్ఞుడవుతాడని అర్థం చేసుకున్నాను. అట్టి సద్గురువును వెదుకుకొను సామర్థ్యము నాకు కలిగించుము తండ్రీ!

76. మొగి సాధనములు నాలుగు, గల నరుడు ముఖ్యాధికారి యగును।
దగిన యుపదేశమునకు, యోగసాధకులలో నారాయణా॥

నా ఆధ్యాత్మిక విద్య నేర్చుకొనదలచిన సాధకుడు ముందు చెప్పబోవు నా నాలుగు సాధనములు కలవాడై ఉండవలయును. అపుడు మాత్రమే అతడు గురుముఖమునుండి సాధన చేయుటకు కావలసిన ఉపదేశమును గ్రహించుటకు అర్హత కలిగి ఉండును అని తెలుసుకుంటిని తండ్రీ!

77. ఇది నిత్యమిదియనిత్యం, బనుచును తనమది వివేకించుటొకటి।
ఎదను నిహపర సుఖముల గోరనిది యిది యొకటి నారాయణా॥

ఆ సాధకుని లక్షణములలో మొదటిది - నిత్యమూ .. ఇది అనిత్యము అని గుర్తించే సామర్థ్యాన్ని కలిగి ఉండటం. రెండవది - మనసులో ఇహలోక సుఖములను, మరియు పరలోక సుఖములను కోరకుండా ఉండుట ఒకటి అని తెలుసుకున్నాను తండ్రీ. నేను సాధకుడగుటకు ఆ లక్షణములు ఒక్కొక్కటి ఆచరించు విధమున నన్ను ఆశీర్వదించుము స్వామీ!

78. ముదముతో శమదమాది షట్కసంపద కలిగియుండు టొకటి।
విదితముగ ముక్తి బొంద, గాంక్షించుటది యొకటి నారాయణా॥

సాధకుడు సంతోషముతో శమము, దమము మొదలైన ఆరు గుణములను కలిగి ఉండటం, నేను ఏవిధంగా అయినా సరే మోక్షమును పొందవలెను అని ధృఢమైన స్పష్టమైన కోరిక కలిగి ఉండటం అత్యంత ఆవశ్యకం అని నేను గుర్తించితిని. అట్టి శక్తిని నీ నిరంతర నామ సాధనవలన నాకు కల్పించుము నారాయణా!

79. ఈ నాల్గు సాధనముల, నధకారార్హుయై నిజాచార్యుజేర।
నానా ప్రకారములను, శుశ్రూష నడుపవలె నారాయణా॥

సాధకుడు పైన చెప్పిన నాలుగు సాధనములు కలిగిఉన్నపుడు మాత్రమే ఆధ్యాత్మిక విద్య నేర్చుకొనుటకు సర్వ విధముల అర్హత కలిగి ఉండును. అపుడు అతడు తన నిజమైన గురువును నిరంతరము అనేక విధముల సేవించుచూ మోక్షము పొందుటకు సాధన చేయుచుండవలెను. అట్టి శక్తి నాకు ప్రసాదించుము నారాయణా!

80. ఉల్లమున గాపట్యము, లవమైన నుండనియ్యక నిరతము।
తల్లి దండ్రియు దైవము, గురువనుచు దలపవలె నారాయణా।

సాధకుడు మనసులో కొంచెమైనను కపటము లేకుండా, నిర్మల, నిశ్చల భక్తితో తాను నమ్మిన గురువునే తల్లిగా తండ్రిగా మోక్షమార్గము చూపు గురువుగ ప్రత్యక్ష దైవముగా భావించి సాధన చేయవలయునని తెలిసికొంటిని. నాకు అట్టి శక్తి ప్రసాదించి నన్ను కృతార్థుని చేయుము నారాయణా!

81. తనువు మనసును సంపద, గురుని సొమ్మని సమర్పణము జేసి।
ఎనసి తత్పరతంత్రుడై, నిత్యమును మెలగవలె నారాయణా॥

సాధకుడు తన శరీరమును, ధనమును, సంపదలను గురువుకు సమర్పించి, అవి తనవి కానేకావు, తన గురువునకు చెందినవే అని తలచుచు అనుక్షణము గురువును సేవించు చుండవలెను. ఆ విధంగా శక్తి నాకు ఒసగమని నిన్ను సదా ప్రార్థించుచున్నాను నారాయణా!

82. ఏనిష్ఠ గురు నిష్ఠకు, దీటుగాదీ ప్రపంచంబునందు।
మానసము దృఢము జేసి, యలరవలె మౌనియై నారాయణా॥

లోకములో గురునిష్ఠకు సమానమైన నిష్ఠ మరేదియూ లేదు. ఏ భక్తి అయినను గురు భక్తికి సాటిరాదు. గురువుపై చూపు మిగిలినవాటిపై చూపు భక్తి శ్రద్ధల కంటెనూ ఉత్తమముగా ఉండవలెను. సాధకుడు మనసును ధృఢముగా గురూపదేశమునందు, సాధన యందు ఏకాగ్ర చిత్తముతో శుశ్రూష చేయవలయునని తెలుసుకొంటిని స్వామి. అట్టి స్థిర చిత్తము నాకు ప్రసాదించుము.

83. ఇట్టి శిష్యుని పాత్రత, వీక్షించి హృదయమున గారుణ్యము।
నెట్టుకొని బ్రహ్మవిద్య, గురుడొసగు నెయ్యమున నారాయణా॥

పై విషయములన్నీ పాటిస్తూ తనకు శిష్యునిగా శుశ్రూష చేస్తున్న సాధకుని లక్షణములన్నిటినీ పరిశీలించి, వాడు అర్హుడో కాదో నిర్ణయించుకుని, తుదకు వాని యోగ్యతను గుర్తించి హృదయములో జాలిపడి వానికి సంతృప్తి తో బ్రహ్మవిద్యను ప్రేమ మీర ఉపదేశించునని తెలుసుకుంటిని నారాయణా! అట్టి అర్హతకు నన్ను పాత్రుని చేయుము తండ్రీ!

84. బ్రహ్మంబు గలుగగానే, యేతత్ప్రపంచంబు గలిగియుండు।
బ్రహ్మంబు లేకున్నను, లేదీ ప్రపంచంబు నారాయణా॥

సాధకునకు గురువుపదేశము వలన – అనంతరము నిర్మల, నిష్కల శుశ్రూష వలన ఆత్మ జ్ఞానము కలుగును. దానివలన అతనికి ప్రాపంచిక జ్ఞానము కలుగును. బ్రహ్మజ్ఞానము లేనివానికి ప్రపంచమే శూన్యము. అని గ్రహించితిని నారాయణా! కావున నాకు అట్టి శక్తిని కలుగచేసి నీ సాన్నిధ్యము ప్రసాదించుము తండ్రీ!

85. ఈ విధంబున సూక్తుల, బ్రహ్మసద్భావంబు గలుగ జేసి।
భావగోచరముజేయు, జిత్స్వరూపములెల్ల నారాయణా॥

ఈ విధముగా గురువు తన ఉపదేశ బలమున, అదేవిధముగా సాధకుని అకుంఠిత దీక్షవలన, బ్రహ్మజ్ఞానముము కలిగించి "చిత్" యొక్క స్వరూప స్వభావములను వాని మనసునకు గోచరమగునట్లు చేయును. అట్టి శక్తి నాకు ప్రసాదించి నన్ను నిజమైన సాధకునిగా మలచుము స్వామీ..

86. ఆ బ్రహ్మమందె పుట్టు, విశ్వంబు నాబ్రహ్మమందేయుండు।
నాబ్రహ్మమందెయణగు, నదె చూడుమని చూపు నారాయణా॥

ఈ విశ్వము ఆ బ్రహ్మ యందు పుట్టును. ఆ బ్రహ్మ యందే ఉండును. ఆ బ్రహ్మ పదార్థములోనే అణిగి పోవును. అని వివరించి సాధకునకు అతని మనోనేత్రమందు గోచరమగునట్లు చేయుము. అట్టి శక్తిని నాకు ప్రసాదించి నన్ను తరింపజేయుము తండ్రీ!

87. అది సచ్చిదానందము, అదిశుద్ధ మది బుద్ధమది యుక్తము।
అది సత్య మదినిత్యము, అది విమలమని తెలుపు నారాయణా॥

ఆ బ్రహ్మ పదార్థమే సచ్చిదానంద రూపము. అది పరిశుద్ధమైనది. సద్బుద్ధిని స్వరూపముగా కలది, యుక్తమైనది. - అదియే నిత్యమూ, సత్యమూ అయినది. అదియే పరంజ్యోతి. అని గురువు సాధకుడైన శిష్యునకు బోధించును. అట్టి బోధనను అవగతము చేసుకుని ఆ సచ్చిదానంద రూపమును దర్శించు భాగ్యము నాకు ప్రసాదించుము తండ్రీ!

88. అదెబ్రహ్మ యదివిష్ణువు, అదె రుద్రుడదియె సర్వేశ్వరుండు।
అది పరంజ్యోతి యనుచు, బోధించు విదితముగ నారాయణా॥

ఆ సచ్చిదానంద రూపమే సృష్టించే బ్రహ్మ. జీవింపచేసే విష్ణువు. లయం చేసే రుద్రుడు. అదియే సర్వేశ్వరుడు. అదియే పరంజ్యోతి అని గురువు శిష్యునకు తన ఉపదేశముచే వివరంగా స్పష్టము చేయును కదా! ఆ విషయములన్నీ అక్షరాలా అవగతం చేసుకుని నన్ను తరింపజేయుము నారాయణా!

89. భావింప వశముగాదు, ఇట్టిదని పలుకశక్యంబు కాదు।
భావంబు నిలుపుచోట, నది తాను పరమౌను నారాయణా॥

ఆ బ్రహ్మ పదార్థము ఇట్టిది అని తలంచుటకు వీలుకానిది. ఇటువంటిది అని పలుకుటకును వీలుకానిది. మనసుకి కాదు, మాటలకు కూడా అందనిది. నిర్మల భక్తితో మనసునందు భక్తి భావమును నిలిపినచోట తానే పరమాత్మ అగునని గ్రహించితిని. అట్టి భక్తి భావము నా మనసునందు నిలిపి నేను నిన్ను దర్శించు భాగ్యము ప్రసాదించుము తండ్రీ!

90. అది మాయతో గూడగ శివుడాయె, నదియవిద్యనుగూడగ।
విదితముగ జీవు డాయె, నని తెలుపు వేర్వేఱ నారాయణా॥

ఆ బ్రహ్మము 'మాయ' తో కలవకుండా తనకు తాను విడిగా ఉన్నచో 'శివము' శుభప్రదమగును. అదే 'మాయ' అవిద్యతో కలిసినచో జీవుడు జీవాత్మ అగునని తెలుసుకుంటిని. ఈ భేదము గుర్తించి అట్టి మాయలో పడకుండా నేను శివైక్యం పొందు శక్తి ప్రసాదింపుము పరాత్మరా!

91. శివుడు కారణశరీరి, కార్యంబు జీవుడాలక్షణములు।
ద్వివిధముగ తెలియు మనుచు, బోధించు వివరముగ నారాయణా॥

సర్వేశ్వరుడైన ఆ శివుడే 'శరీరమునకు కారణము'. జీవుడు 'కార్యం' ఈ రెండు లక్షణములు సవివరముగా తెలుసుకోమని గురుదేవులు బోధ చేయుచున్నారు. ఆ బోధను అర్థం చేసుకుని నేను నిన్ను దర్శించు భాగ్యము కలుగజేయుము తండ్రీ!

92. అరయ నిరువదినాలుగు, తత్త్వంబులై యుండు చందములను।
కరతలామలకముగను, బోధించు ప్రకటముగ నారాయణా॥

సాధకుడైన శిష్యునకు ఇరువది నాలుగు తత్త్వములను, వాటి విశేషములన్నియు సులభముగా అర్థమగు రీతిలో ఒక పద్ధతిలో బోధించును. వాటినన్నిటిని అవగాహన చేసుకుని నీదరి చేరు మార్గము సులభతరం చేయుము నారాయణా!

93. కారణము కార్యమగుచు, వ్యవహార కారణాఖ్యత నుండును।
నారూఢి బ్రహ్మాండము, పిండాండమని తెలుపు నారాయణా॥

లోకములో 'కారణమే' కార్యము అని వ్యవహరించుచున్నారు. బ్రహ్మాండము 'కారణ' మనియు, పిండాండము 'కార్య' మనియు తెలుసుకొనమని గురువు శిష్యునకు అమూలాగ్రముగా తెలియచేయును. కావున అట్టి శక్తి నాకు ప్రసాదించి నన్ను తరింప జేయుము తండ్రీ!

94, ఐదు భూతములు, నింద్రియములు పది, యంతరంగములు నాల్గు।
ఐదు విషయములు, తత్త్వసంఘాత మని తెలుపు నారాయణా॥

స్వామీ! పంచ భూతములు; జ్ఞానేంద్రియ కర్మేంద్రియములు పది; అంతరంగము, మనోబుద్ధి మొదలైనవి నాలుగు, విషయములు ఐదు; వీని మొత్తము తత్త్వములు ఇరువది నాలుగు అని గురువు శిష్యునకు సహేతుకంగా వివరించును. వానిని పరిపూర్ణముగా అర్థము చేసుకునే సాధకునిగాజేసి నన్ను పరిగ్రహింపుము నారాయణా!

95. స్థూల సూక్ష్మాకృతులును, గారణముతో మూడుతెఱగులగును।
మూలమగు జలనభాగ్ను, లని తెలుపు లాలించి నారాయణా॥

స్థూలము, సూక్ష్మము, కారణము అని శరీరము మూడు విధములు అనియు, ఆమూడును జీవి యందు అమరి ఉండును అనియు గురువు సాధకుడైన శిష్యునకు వివరించును. గురువుగారి శిక్షణలో నేను స్వచ్ఛమైన సాధకునిగా మారి నిన్ను చేరు భాగ్యము ప్రసాదించుము

తండ్రీ!

96. వెలసి పంచీకృతములు, నగుభూతములకు బుట్టినతనువు।
అలస్థూలమగుననుచును, బోధించుదయతోడ నారాయణా॥

పంచ భూతముల తత్వములు ఒకదానితో ఒకటి కలిసి, పంచీకరణము చెంది స్థూలశరీరము ఏర్పడును అన్న ముఖ్య విషయమును సాధకుడైన శిష్యునకు గురువు వివరించును. అట్టి స్థూల శరీరము గల నేను అనుక్షణము నిన్ను ధ్యానించుచూ, నిన్ను చేరు భాగ్యము కల్పించుము నారాయణా!

97. ఐదు నయిదింద్రియములు, ప్రాణంబులయిదు మనసును బుద్ధియు।
బాదుకొని సూక్ష్మమందు, బోధించు బ్రకటముగ నారాయణా॥

పంచేంద్రియములు, ప్రాణములైదును, మనసు, బుద్ధి వీటి అన్నింటి సంయోగము వలన సూక్ష్మ శరీరము ఏర్పడును అని గురువు సాధకుడైన శిష్యునకు ఎరుకపరచును. కావున ఆ సూక్ష్మ శరీరముచే నేను నిన్ను చేరుకొను మోక్ష మార్గమును నాకు ప్రసాదించుము తండ్రీ!

98. గాఢమగు నజ్ఞానము, ఈ రీతి గారణ శరీరమగును।
మూఢులకు వశముగాదు, తెలియ విను మోదమున నారాయణా॥

పరిపూర్ణ అజ్ఞానం వలన ఈ కారణ శరీరము ఏర్పడునని మూఢులైన వారు ఈ విషయమును తెలుసుకొనలేరని జ్ఞానులైన వారు మాత్రమే ఈ విషయమును అర్థము చేసుకుని ఆనందమును పొంది నిజమైన సాధకుడు నిన్ను చేరు మార్గమును అన్వేషించునని గురువు సాధకునకు తెలియజేయునని తెలుసుకుంటిని నారాయణా!

99. ఈ మూడు తనువులందు, దానుండి యీ తనువు తాననుచును।
వ్యామోహపడుచుండును, జీవుండు వరుసతో నారాయణా॥

తన శరీరమున కలిగిన జీవుడు ఈ శరీరము తనదే అని వ్యామోహపడుచుండును. అట్టి వ్యామోహమునకు లొంగక ఆ పరమాత్ముని కైవల్యము పొందుటకు సాధన చేయుము అని గురువు సాధకుడైన శిష్యునకు బోధించునని అర్థము చేసుకున్నాను తండ్రీ!

100. కలలేక నిద్రించును, కలగాంచి కడుమేలు కొనుచుండును।
కలకాలమీజీవుడు, త్రివిధముల గలసియును నారాయణా॥

జీవుడు ఈ మూడు శరీరములందును 'కల' రాని నిదుర నిద్రించును. ఒక్కొక్కప్పుడు 'కల' గని హఠాత్తుగా మేలుకొనును. జీవుడెల్లప్పుడు ఈ మూడు శరీరములలోనూ కలిసి ఉండును అని గురువు శిష్యునకు వివరించునని తెలుసుకొంటిని తండ్రీ!

101. ప్రాజ్ఞ తైజస విశ్వులు, తానె యీ పర్యాయముగ జీవుడు।
ప్రజ్ఞ గోల్పడి పొందును, సంసారబంధంబు నారాయణా॥

జీవుడు ఈ మూడు శరీరములందును "ప్రాజ్ఞ, తైజస, విశ్వ" అనెడి భావములతో నివసించుచు అసలైన జ్ఞానమును కోల్పోయి సంసార బంధనముల చిక్కుకొనును అని గురువు సాధకునకు తెలుపును. అట్టి సంసార బంధనములలో చిక్కుకున్న నన్ను సర్వవిధములా నిన్ను చేరు మోక్ష మార్గమును చూపి నన్ను పరిగ్రహించుము తండ్రీ!

102. మూడవస్థలకు సాక్షి, యైనట్టి మూలంబుదా దెలిపియు।
చూడుమని తన్మార్గము, దేటగా జూపును నారాయణా॥

"జాగ్రత్, స్వప్న, సుషుప్తులు" అను మూడు అవస్థలకును 'మతి(బుద్ధి)' సర్వమూ తెలిసిన సాక్షిగా ఉండి, మంచి మార్గమునుచక్కగా గురువు సాధకునకు చూపును అని గ్రహించితిని. అట్టి సన్మార్గమున నడచి నిన్ను చేరుకొను భాగ్యము ప్రసాదింపుము నారాయణా!

103. నీవు దేహంబుగావు, ప్రాణంబు నీవుగావు నింద్రియములు
నీవు గాదని తెలుపును, వేదాంత నియమమున నారాయణా॥

గురువు శిష్యునకు "ఈ దేహము, ప్రాణము, ఇంద్రియములు అయిదును, 'నీవు' ను .. ఇవేమియు నీవు గావు అని తెలియజేయును. ఏదియు నాది కాని ఈ దేహముతో అను క్షణము నిన్ను ధ్యానించుచు నీ సాయుజ్యము చేరు భాగ్యం ప్రసాదింపుము తండ్రీ!

104. అనల తప్తంబుగాదు, జలమునను మునిగి తడి జెందబోదు।
అనిల శుష్కంబు గాదు, నిరుపమంబని తెలుపు నారాయణా॥

ఈ ఆత్మ అగ్నిలో పడినను ఆ వేడిని పొందదు. నీటిలో మునిగినను తడువదు. గాలికి ఎగిరిపోనిది, ఇది ఇట్టిది అని పోల్చి చెప్పలేనిది అని గురువు సాధకునకు తెలియజేయును. అట్టి పరిశుద్ధమైన ఆత్మతో నిన్ను చేరు భాగ్యము నాకు ప్రసాదించుము తండ్రీ!

105. కావహంకారమిపుడు చిత్తంబు, గావు బుద్ధి నీవు-
కావు మనసును, సత్యము, సాక్షివగు గట్టిగా నారాయణా॥

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్
Kiron Type Institute

ఈ "నీవు" – అహంకారముగాని, చిత్తము గాని, బుద్ధిగాని, మనసుగాని ఏమియును కాదు. కానీ అదియే సత్యము. ప్రత్యక్షముగా అన్నింటిని గమనించు సాక్షి అగుచున్నది అని గురువు తెలియజేయును. అట్టి జ్ఞానమును నేను పొంది నీ దరి చేరునట్లు నన్ను సదా అనుగ్రహింపుము నారాయణా!

106. దేహధర్మములు నీకు, దోచుటంతే గాని నిత్యముగను।
మోహంబుమానుమనుచు, బోధించు ముఖ్యముగ నారాయణా॥

దేహము యొక్క ధర్మంబులు – అనగా ఆకలి, కోరిక, మున్నగునవి ఉన్నట్లు అనిపించును. అవి సత్యములు అనిపించును. కానీ కావు. మోహమును విడువుమని గురువు బోధించును. అట్టి మోహమునకు నేను లొంగకుండా సదా నిన్ను ధ్యానించుచూ నిన్ను చేరుకొనే భాగ్యము నాకు ప్రసాదించుము నారాయణా!

107. ఎన్ని దేహములు చెడిన, నీవు చెడవేకస్వరూపుండవగుట।
జెన్నలరి యుందువిలను, దత్త్వప్రసిద్ధముగ నారాయణా॥

'ఆత్మ' ఎన్నో దేహములు ధరించినను, ఆ దేహములు ఎన్ని విధములుగా చేసినను, ఆ 'ఆత్మ' యధాప్రకారముగా ప్రకాశించుచునే యుండును. 'ఆత్మ' శాశ్వతము గాని, దేహము శాశ్వతము కాదు అని గురువు విశదపరచును. అట్టి పవిత్ర ఆత్మ తో నిన్ను ధ్యానించు నన్ను నీయందు లయము చేసికొనుము తండ్రీ!

108. అన్ని వేదాంతవాక్యములలో, మహావాక్యములు నాలుగు।
నిన్ను బ్రహ్మంబుగాను, వర్ణించు నిక్కముగ నారాయణా॥

వేదాంత వాక్యములలో మహావాక్యములు నాలుగు. అవి 01. 'ప్రజ్ఞానం బ్రహ్మ" (ఐతరేయోపనిషత్తు .. ఋగ్వేదము) 02. "అహం బ్రహ్మాస్మి" (బృహదారణ్యకోపనిషత్తు .. యజుర్వేదము) 03. "తత్ త్వమసి" (ఛాందోగ్యోపనిషత్ .. సామవేదము) 04. అయమాత్మా బ్రహ్మ" (మాండూక్యోపనిషత్ .. అధర్వణ వేదం) అనునవి. ఈ నాలుగును నిన్ను ఈశ్వరుడవని వివరించునని గురువు తెలియజేయును. వానిని పరిపూర్ణముగా అవగతము చేసుకుని, నీ కైవల్యము చేరు భాగ్యము ప్రసాదించమని వేడుకుంటున్నాను తండ్రీ!

109. ఉభయ దృశ్యోపాధుల, గడద్రోసిపోకయయ్యాత్మ మిగులు।
నభయముగ నిటులెప్పుడు, చింతింపుమని తెలుపు నారాయణా॥

జీవునికి గల లక్షణములు పరిమితి గలవి, పరిమితికి లోబడినవి – కాని పరమాత్మకు చెందిన లక్షణములు అనంతము. కానీ జీవాత్మ, పరమాత్మ ఇవి రెండును నిత్యములే ..

Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

అయితే చివరకు జీవాత్మలోని "జీవత్వము" నశించిపోయి ఆత్మ, పరమాత్మలు భయవిహీనముగా ఉండును. ఈ బేధము గ్రహించి పరమాత్మలో లీనమగు ఆత్మానుసంధానము చేయుటకు సాధన చేయుము అని గురువు తెలియజేయును. అట్టి శక్తి నాకు ప్రసాదించుము తండ్రీ!

110. జీవశివతారతమ్యముల, కైక్యసిద్ధి గానేరదనుచు।
భావసంశయము దీర్చు, కార్యార్థ పటిమచే నారాయణా॥

గురువు జీవునకు, పరమాత్మకు గల బేధమును వివరిస్తూ .. విభిన్నములైన ఆ రెంటికినీ 'ఐక్యము' కలుగజాలదని తెలిపి .. శిష్యుని సందేహములన్నింటినీ పోగొట్టి, భావమును స్పష్టముగా చెప్పుచూ, జీవుడు ఈ ప్రపంచమునకు వచ్చిన కారణము, కార్యము, ప్రయోజనము మున్నగునవి వివరించి తెలుపును అని గ్రహించితిని .. కనుక ఆత్మతో నీయందు లయమగునట్లు నన్ను అనుగ్రహింపుము పద్మనాభా!

111. నిర్వికారుడవు నీవు, నీ యందె నిజమైన చందమునను।
బర్వు బ్రకృతివికారము, లని తెలుపు ప్రౌఢిచే నారాయణా॥

నీవు నిర్వికారకుడవు .. అనగా ఎటువంటి మార్పు చెందనివాడవు. కానీ ప్రకృతి–మాయ వలన నీ యందు ఆ 'వికారములు' నిజముగా ఉన్నవని అనిపించును. గానీ మనసుతో చూసినచో నీ యందు నిజమైన అందచందములు గోచరించును అని గురువు తెలుపును. అట్టి మనసుతో చూసి సదా నిన్ను చేరుకొను భాగ్యము కల్పించుము తండ్రీ!

112. సద్గురుండీరీతిగా, బోధించు సరళితో వాక్యార్థము।
హృద్గతము జేసియుండి, జగతి జీవింపుచును నారాయణా॥

ఈ విధముగా సద్గురువు "మహా వాక్యముల"న్నింటిని సహేతుకమైన ఉదాహరణలతో అర్థమును చక్కగా వివరించి ఆ భావము శిష్యుని హృదయమునకు పట్టేటట్లు చేసి సద్గురువుగా చిరకాలమూ ఈ ప్రపంచములో జీవించునని తెలుసు కొంటిని. అటువంటి సద్గురువు శిష్యుడనై సాధకునిగా నిన్ను చేరు భాగ్యము ప్రసాదింపుము నారాయణా!

113. అని చింతనముజేయుచు, జిత్తమునదనివి జెందుచు నెపుడును।
కమదమ్ములను ముడుచుచు, తన్మయము నొందుచును నారాయణా।

శిష్యుడు తనకు గురువు బోధించిన విషయమునే తన మనసు నందు తలచుకొనుచు మనసులో తృప్తిని పొందుచూ తన్మయత్వముతో కనులు మూసుకుని ధ్యానము చేయుచుండును. అట్టి శక్తి నాకు ప్రసాదించి నన్ను నీ కరుణకు పాత్రుని చేయుము నారాయణా!

114. అపగతాఘకృత్యుడై, యీ రీతి నభ్యాస మొనరించుచు।
నపరోక్షసిద్ధినొందు, బ్రహ్మంబు తానగుచు నారాయణా॥

గురువు చెప్పినట్లుగా ఈ విధముగా ధ్యానము పొంది, అన్ని విషయముల యందు సమత్వమును సాధించి ఆ స్థితిని అభ్యసిస్తూ .. చివరకు ప్రత్యక్షముగా బ్రహ్మ సాక్షాత్కారము పొంది "తానే ఆ బ్రహ్మ స్వరూపమని" అనుభవపూర్వకముగా తెలుసు కొనును. అట్టి భావమే ఆత్మానందము కలుగజేయుచున్నది. అట్టి నిజ స్థితిని పొందు భాగ్యము ప్రసాదించుము తండ్రీ!

115. కందళిత హృదయుడగుచు, సచ్చిదానందస్వరూపుడగుచు।
సందర్శితాత్ముడగుచు, నుండు నవికారతను నారాయణా॥

ఇటువంటి స్థితిని పొందిన గురువు లేదా సాధకుడు సంతోష పరవశమైన హృదయమును కలిగి ఉండి, సచ్చిదానంద స్వరూపమును పొంది అన్నియు తానే అయి, ఆత్మసాక్షాత్కారము పొందినవాడై, వికారము గల స్థితిలో ఉన్నను, నిర్వికారునిగా ఉండునని అర్థమైనది. అటువంటి స్థితికి నన్ను చేర్చి తద్వారా నిన్ను పొందు భాగ్యమును నాకు ప్రసాదించుము తండ్రీ!

116. అవ్యయానంద పూజ్య, రాజ్యసింహాసనాసీనుడగుచు।
భవ్యాత్ముడై వెలసెను, బూజ్యసంభావ్యుడై నారాయణా॥

గురువు లేదా సాధకుడు ఈ అవ్యక్త పరిపూర్ణ ఆనందభరితుడై, తాను సంపాదించుకున్న గౌరవమునకు తగిన అర్హమైన యోగ రాజ్య సింహాసనమున కూర్చుండి భవ్యాత్ముడై, తలచుకున్న వెంటనే సాధకునికి గూడా గుర్తింపు కలుగ జేయువాడై నిలుచునని గ్రహించితిని పరమాత్మా.. అట్టి సాధకునిగా నన్ను మలచి నాకు మోక్షమును ప్రసాదించుము ప్రభూ!

117. నీవు సకలంబుగాని, యున్నదే నీ కన్న వేఱొక్కటి।
జీవుడని వర్ణించుట, వ్యవహార సిద్ధికిని నారాయణా॥

ఈ సకల చరాచర సృష్టి అంతయూ నీవే. నీవు కానిది ఏదియును లేదు. నిన్ను తెలుసుకొనుటకై జీవమను రూపమున వ్యవహరించుట జరుగుతున్నది. కానీ జీవ – పరమ – ఆత్ముడవు నీవే సుమా .. అని అవగతమైనది. ఈ జీవాత్మను నీయందు లయము చేయు భాగ్యము ప్రసాదించుము తండ్రీ!

118. చిలుక పలుకుల బలికితిని, నాకేమితెలియు, దత్త్వరహస్యము।
వలదునను నేరమెంచ, సాధులకు నలినాక్ష నారాయణా॥

చిలుక తాను విన్న మాటలకు అర్థము తెలిసిన, తెలియకపోయినా ఏ విధముగా పలుకునో, అదే విధముగా సాధకులకు తెలిసిన తత్వ రహస్యము ఏ మాత్రము పరిపూర్ణముగా తెలుసుకొనక నాకు తోచిన రీతిని మాటలాడితిని, చిన్నవాడను, అజ్ఞానిని, వాచాలుడను అని నా నేరము ఎంచక సాధువులైన సాధకులకు పద్మాక్షుడవై ఏవిధముగా దర్శనము ఇచ్చి రక్షింతువో అదేవిధముగా సామాన్యుడనైన నన్ను రక్షించి నీదరి చేరుకొనుము పద్మనాభా!!

119. శరణు భక్తార్తిహారి, గురురూప శరణు సజ్జన రక్షక।
శరణు దురితౌఘనాశ, శరణిపుడు కరుణించు నారాయణా।
శరణిపుడు కరుణించు నారాయణా।

నీవు భక్తుల బాధలను పోగొట్టువాడవు. గురువు రూపమున ఉన్నవాడవు. సజ్జనులను రక్షించుచూ.. పాపములు నశింపజేస్తూ జీవులను కాపాడు వాడవు. నన్ను సర్వ విధముల రక్షించువాడవు నీవు మాత్రమే... నిన్ను శరణము పొందితిని. నన్ను అంత్యమున నీయందు లయమగు వరమును ప్రసాదించుము పరమాత్మా! తండ్రీ!
శరణు శరణు ప్రాణవల్లభా!!!

120. కాయేన వాచా మనసేంద్రియైర్వా, బుద్ధ్యాత్మనావా ప్రకృతే స్స్వభావాత్।
కరోమియద్యత్సకలం పరస్మై, నారాయణా యేతి సమర్పయామి॥
నారాయణా యేతి సమర్పయామి॥

॥ లోకాః సమస్తాః సుఖినో భవన్తు ॥

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్



(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి.–944 044 9650, 994 994 1430)

Kiron Type Institute